ఆంధ్రజ్యోతి
నిజామాబాద్
జిల్లా వార్తలు
1
గురువారం 2 అక్టోబరు 2025


● సందడిగా నిజామాబాద్ మార్కెట్

నేడే విజయ దశమి



- వేడుకలకు పూర్తయిన ఏర్పాట్లు
- జిల్లాలో సందడిగా మార్కెట్లు
- అధర్మంపై ధర్మం విజయమే దసరా
- ఆయుధ, వాహనాల పూజకు ప్రత్యేకం
- నేటితో ముగియనున్న నవరాత్రి ఉత్సవాలు

'చెడు'పై 'మంచి' సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకొనే వేడుకే విజయదశమి. గురువారం దసరా సంబరాలను ఘనంగా జరుపుకొనేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. శమీ, ఆయుధ పూజలు, రావణ దహనాలు, విందు వినోదాలతో రోజంతా సరదాగా గడపనున్నారు.

- నిజామాబాద్ కల్చరల్/బోధన్

జోరుగా వాహనాల కొనుగోలు..

దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని వాహనాల కొనుగోలు జోరుగా సాగాయి. జిల్లా కేంద్రంలోని ద్విచక్ర వాహన కేంద్రాలతో పాటు మధ్య, భారీ వాహనాల కొనుగోలు జరిగాయి. దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని 9 రోజుల పాటు ప్రత్యేక ఆఫర్లతో వినియోగదారులను ఆకర్షించే విధంగా లక్కీ డిప్‌లు వంటివి వ్యాపారులు ఏర్పాటు చేశారు. దీంతో పాటుగా దసరా నమ్మకంతో పాటు జీఎస్టీ తగ్గడం, ఆఫర్లు ఇవ్వడంతో అధిక సంఖ్యలో వాహనాలు, వస్తువులు అమ్మకాలు సాగాయి.

శమీపూజ, పాలపిట్ట దర్శనం..

విజయదశమి రోజు కొత్త బట్టలు ధరించి కుటుంబ సభ్యులందరూ కలిసి ఊరి మధ్య ఏర్పాటు చేసిన శమీవృక్షం కింద ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం జమ్మి ఆకులను పెద్దలకు ఇచ్చి, ఆశీర్వాదం పొందుతారు. పాలపిట్ట దర్శనం చేసుకొని బంధువులు, స్నేహితులకు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటారు. సాయంత్రంవేళ రావణ దహనాలు కొనసాగు తాయి. దసరారోజు పాలపిట్ట దర్శనాన్ని శుభసూ చికగా భావిస్తారు.

పండుగతో సందడిగా మారిన నగరం..

తెలంగాణలో అత్యంత ఘనంగా నిర్వహించుకునే విజయదశమి పండుగ కావడంతో నగరమంత సందడి వాతావరణం నెలకొంది. ప్రధాన కూడళ్ల వద్ద పండుగకు కావలసిన వ్యాపార సముదాయాలు ఏర్పాటయ్యాయి. పండుగ రోజు ప్రతి ఒక్కరూ కొత్త దుస్తులను వేసుకోవడం సంప్రదాయం ఉండడంతో దుస్తులు, కొత్త వస్తువులు కొనడానికి వినియోగ దారులు ఆసక్తిని చూపారు. వ్యాపారులు వినియోగదారులను కొత్త కొత్త డిజైన్ గల దుస్తులతో ఆకర్షిస్తున్నారు. గాంధీచౌక్, హైదరాబాద్ రోడ్, కలెక్టర్ మైదానం, కంఠేశ్వర్, వినాయక్ నగర్ హనుమాన్ జంక్షన్, పెద్దబజార్, గాంధీచౌక్, రైల్వేస్టేషన్, గోల్‌హనుమాన్, కంఠేశ్వర్ బైపాస్ రోడ్, వీక్లిమార్కెట్ తదితర ప్రాంతాల్లో దసరా శోభ నెలకొంది.

ఆయుధ పూజకు సిద్ధం..

విజయదశమి పర్వదినాన్న వాహనాలు, ఆయుధాలను పూజించడం సంప్రదాయంగా వస్తుంది. నవదుర్గ రూపంగా వాహనాలను ఆయుధాలుగా భావించి విజయదశమి పర్వదినాన్న పూజించడం వల్ల సంవత్సరం పొడవున ఎలాంటి ఆపదలు రావని విశ్వసిస్తారు. కొత్తగా వాహనాలు కొనేవారు విజయదశమి రోజును ప్రత్యేకంగా భావిస్తారు.


● మార్కెట్‌లో పూజా సామగ్రి కొనుగోలు




● మార్కెట్‌లో పూల విక్రయాలు


● నూతన వాహనాలకు పూజలు



'మందు' చూపు!

- లిక్కర్ కొనుగోలుకు మద్యం ప్రియుల క్యూ
- పలు వైన్స్‌లలో సరుకులు ఖాళీ
- పనివేళల అనంతరం షట్టర్లకు సీల్
- నేడు మద్యం దుకాణాల బంద్ నేపథ్యంలో సందడి

సుభాష్‌నగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గాంధీజయంతి సందర్భంగా గురువారం మద్యం దుకాణాలు మూసి ఉండనున్నాయి. దీంతో మద్యం ప్రియులు ముందుజాగ్రత్తగా అధికంగా మద్యం కొనుగోలు చేశారు. గాంధీ జయంతి రోజు దసరా పండగ రావడంతో మద్యం ప్రియులకు ఇబ్బందిగా మారింది. దసరా అంటేనే సుక్క.. ముక్క.. అనే నానుడి. దసరా పండగ రోజు మద్యం, మాంసం దుకాణాలు మూసి ఉండటంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. మద్యం దుకాణాలు బంద్ అన్న సమాచారంతో మద్యం దుకాణాల వద్ద బుధవారం సందడి నెలకొంది. ఉదయం మద్యం దుకాణాలు తెరిచిన సమ యం నుంచే మద్యం దుకాణాల కొనుగోలుకు మద్యం ప్రియులు ఎగబడ్డారు. దుకాణాల ముందు గురువారం సెలవు అని బోర్డులు తగిలించారు. రాత్రి 10గంటల తర్వాత ఎక్సైజ్ అధికారులు స్టాక్ బుక్‌లో సంతకం చేయించుకొని దుకాణాలకు సీల్ వేశారు.

ఎస్సారెస్పీకి 3లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- 39 గేట్ల ద్వారా నీటి విడుదల

మెండోర, అక్టోబరు, 1(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు ఎస్సారెస్పీలోకి 3 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు 39 వరద గేట్లు ఎత్తి గోదావరిలోకి 2 లక్షల 50 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 4000 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి 4000 క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 400 క్యూసెక్కులు, లక్ష్మి కాలువకు 150 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 600 క్యూసెక్కులు, మిషన్ భగీరథ 231 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి ప్రస్తుత నీటిమట్టం 1086 అడుగుల 63 టీఎంసీల నీటినిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.


గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

పేదలను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నం

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ


లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న షబ్బీర్ అలీ, చిత్రంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అప్పుల్లో ఉన్నా.. పేదలను ఆదుకోవడానికి ప్రయత్నం చేస్తుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో బుధవారం లబ్ధిదారులకు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తతో కలిసి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, రైతు రుణ మాఫీ, రైతుభరోసా, యువతకు ఉద్యోగాలు, సన్నబియ్యం పథకాలను అమలు చేస్తున్నామన్నారు. సుమారు 95 మంది లబ్ధిదారులకు 95లక్షల 11వేల 20రూపాయలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. షాదీముబారక్ లబ్ధిదారులకు సుమారు 349 మంది లబ్ధిదారులకు 3కోట్ల 49లక్షల 40వేల 484 రూపాయలను అందించామన్నారు. మొత్తంగా 4కోట్ల 44లక్షల 51వేల 504 రూపాయలు అందించామన్నారు. అనంతరం ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త మాట్లాడుతూ నిరుపేదల కోసం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం కింద పంపిణీ చేస్తున్న డబ్బులతో పాటు తులం బంగారాన్ని కూడా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.


● ఆర్మూర్‌లో సాగవుతున్న మొక్కజొన్న

చేతికొచ్చిన పంట.. చేనులోనే నిల్వ

జిల్లాలో ప్రారంభం కాని మొక్కజొన్న కొనుగోళ్లు

- పంట కోసినా కొనుగోలు కేంద్రాల జాడే లేదు
- దళారులకు విక్రయించి నష్టపోతున్న రైతులు
- క్వింటా రూ.2 వేలకే కొంటున్న ప్రైవేటు వ్యక్తులు
- వర్షాల భయంతో దళారులకు విక్రయాలు
- జిల్లాలో 53వేల 93 ఎకరాలలో పంట సాగు

ఆర్మూర్ ప్రాంతంలో మొక్కజొన్న సంప్రదాయ పంట. జిల్లాలో 53వేల 93 ఎకరాలలో పంట సాగుచేస్తుండగా ఆర్మూర్, భీమ్‌గల్ పరిధిలో సుమారు 44వేల ఎకరాలలో పంట సాగవుతుంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట అకాల వర్షాలు నష్టాలే తెచ్చి పెడుతోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు పంటను దళారులకు విక్రయించాల్సి వస్తోంది. గత సంవత్సరం మొక్కజొన్న క్వింటాలుకు 2100కు మార్కెట్లో విక్రయించగా ప్రస్తుతం మొక్కజొన్న ధర క్వింటాలుకు రూ.1,900 నుంచి రూ.2000 మాత్రమే పలుకుతోంది. ప్రైవేటుకు విక్రయించడంతో రైతులు నష్టపోతున్నారు.

ఆర్మూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మొక్కజొన్నలను రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తే రైతులకు మద్దతు ధర లభిస్తుంది. కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వ మద్దతు ధర రూ.2,300 నుంచి రూ.2,400 వరకు చెల్లిస్తారు. దీంతో రైతుకు క్వింటాలుకు రూ.300 అదనంగా వచ్చి ఎకరాన రూ.7,500 లబ్ధిపొందుతారు. దీంతో రైతులకు ప్రయోజనకరంగా మారుతుంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక తమ వ్యవసాయ ఉత్పత్తులను దళారులకు విక్రయించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

మొక్కజొన్న రైతులకు అన్ని కష్టాలే

మొక్కజొన్న పంట సాగుచేస్తున్న రైతులకు కష్టాలు అధికంగానే ఉన్నాయి. మొక్కజొన్న 120 రోజుల పంట. ఎకరాన 25 క్వింటాళ్ల దిగుబడులు వస్తున్నప్పటికి సరైన మద్దతు ధర రాకపోవడంతో రైతులకు ఆశించిన స్థాయిలో లాభాలు రావడం లేదు. దీనికి తోడు పంటకోత సమయంలో అకాల వర్షాలతో పంటకు నష్టం వాటిల్లుతుంది. పంటకోసిన తర్వాత మక్కలను ఎండ బెట్టడానికి సరైన ప్లాట్‌ఫాంలు లేక రోడ్లపైనే వేయాల్సి వస్తోంది. ఇలాంటి సమయంలో ప్రమాదాలు సంభవించే ఆస్కారం ఉంది. మక్కలను ఎండ బెట్టిన రైతులకు వర్షాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. కురిసిన వర్షాలకు మక్కలు తడిసిపోతే క్వింటాలుకు 100 నుంచి 200 రూపాయలు ధర తగ్గి నష్టపోవాల్సి వస్తోంది. పసుపు రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై తాటి పత్రాలు అందజేస్తున్న విధంగానే మొక్కజొన్న రైతులకు తాటిపత్రాలు అందజేస్తే వర్షాలు కురిసే సమయంలో తమ పంటను కాపాడుకునే అవకాశం ఉంది.

మార్కెట్లో విక్రయించి నష్టపోతున్నాం..

: యాల్ల రాజ్‌కుమార్, గోవింద్‌పేట్, రైతు



మొక్కజొన్న పంటను ఆరు ఎకరాల్లో సాగుచేశా. ఈ సారి మక్కలకు ధర లేకపోవడతో నష్టపోతున్నాం. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో బయట మార్కెట్లో విక్రయించాం. క్వింటాలుకు 1900 రూపాయలు పలికింది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తే సుమారు 50 వేల రూపాయలు ఆదా అయ్యేది.

కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం..

: సాయికృష్ణ, ఇన్‌చార్జి ఏడీఏ, భీమ్‌గల్



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు మార్కెటింగ్ శాఖ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు రాగానే కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. రైతులు తొందరపడి దళారులకు మొక్కజొన్నలను విక్రయించి నష్టపోవద్దు. ప్రభుత్వ కేంద్రాల ద్వారా క్వింటాలుకు 300 రూపాయలు రైతులకు అదనంగా లాభం చేకూరుతుంది.


వరదలకు ధ్వంసమైన అంతర్రాష్ట్ర రోడ్డు

అంతర్రాష్ట్ర రోడ్డు ధ్వంసం

- ఎడతెరిపి లేని వర్షాలతో నీటమునిగిన రహదారి
- మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు నిలిచిన రాకపోకలు
- బాసర మీదుగా ధర్మాబాద్ వెళ్లాలంటున్న అధికారులు

రెంజల్, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందకుర్తి అంతర్రాష్ట్ర రహదారి ధ్వంసానికి గురైంది. వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఎగువ నుంచి భారీగా వరద రావడంతో అంతర్రాష్ట్ర బ్రిడ్జి పూర్తిగా నీట మునిగి రహదారి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో కందకుర్తి అంతర్రాష్ట్ర బ్రిడ్జి మీదుగా మహారాష్ట్ర ధర్మాబాద్ వైపు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రహదారి ధ్వంసమవ్వడంతో అటు వైపుగా ఎవరు వెళ్లకూడదని తహసీల్దార్ శ్రావణ్ కుమార్ సూచించారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. అంతర్రాష్ట్ర బ్రిడ్జిగా ఎవరు వెళ్లకూడదని బారికేడ్లను ఏర్పాటు చేశారు. ధర్మాబాద్ వెళ్లే వారు బాసర మీదుగా వెళ్లాలని సూచించారు.



ఏమో విమానం.. ఎగరావచ్చు..!

- జిల్లాలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుపై చిగురిస్తున్న ఆశలు
- జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు
- సాకారమైతే జిల్లాలోని గల్ఫ్ కార్మికులకు ఉపయోగం

నిజామాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్న నేపథ్యంలో ఇదివరకే జిల్లాలో జక్రాన్‌పల్లిలో ఏర్పాటు చేయాలనుకున్న ఎయిర్‌పోర్ట్ నిర్మాణం మళ్లీ తెరపైకి వస్తుంది. రాష్ట్రంలో ఇప్పటికే వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా రామగుండం, భద్రాద్రి కొత్తగూడం, ఆదిలాబాద్‌లలో కూడా ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు ప్రభుత్వం ఓకే చెప్పింది. ఈ నేపథ్యంలో మరో రెండు కొత్త ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాతో పాటు మహబూబ్‌నగర్ జిల్లాలో ఎయిర్‌పోర్ట్‌ల ఏర్పాటుకు రానున్న రెండుమూడేళ్లలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 2008లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 8 చిన్న విమానాశ్రయాల ఏర్పాటుకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందని ఈ మేరకు జక్రాన్‌పల్లి మండలంలోని మనోహరాబాద్, తొర్లికొండ, కొలిప్యాక్ గ్రామాల పరిధిలో 1663 ఎకరాల స్థలంలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌ను ఏర్పాటు చేసేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేక ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదనలు అలాగే ఉన్నాయి. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇచ్చిన నివేదికలు సైతం ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అడ్డంకిగా మారాయి. స్థలం అనుకూలంగా లేదని అదే విధంగా విద్యుత్ స్తంభాలు, పొలాలు ఉన్నాయని నివేదిక ఇవ్వడంతో ప్రతిపాదనలు అలాగే ఉండిపోయాయి. మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానికి పచ్చజెండా ఊపడంతో మళ్లీ జిల్లాలో విమానాశ్రయ ఏర్పాటు ఆశలు చిగురిస్తున్నాయి. హైదరాబాద్, నాందేడ్ వంటి పట్టణాలకు గంటల తరబడి ప్రయాణం చేసి విమానయానం చేయాల్సిన పరిస్థితి ఉండటంతో జిల్లాలో కూడా ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేయాలని జిల్లా వాసులు ఎప్పటి నుంచో కోరుకుంటున్నారు. జిల్లా నుంచి లక్షలాది మంది గల్ఫ్ కార్మికులు ఉన్నారు. ఈ నేపథ్యంలో విమానాశ్రయం ఏర్పాటైతే సౌకర్యంగా ఉంటుందని జిల్లా వాసులు ఎదురు చూస్తున్నారు.

మద్యం దుకాణాలకు ఐదు దరఖాస్తులు 3

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



కమ్మర్‌పల్లి బస్సుఢీకొన్న ప్రమాదానికి గురైన కారు

కమ్మర్‌పల్లి,అక్టోబరు 1:(ఆంధ్రజ్యోతి)కమ్మర్‌పల్లి శివారులోని లలితపీఠ ఆశ్రమంవద్ద జాతీయరహదారి63పై బుధవారం మధ్యాహ్నం ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, కారుఢీకొన్నాయి ఈ ప్రమాదంలో కారు నడుపతున్న జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్ రావుపేట్‌కు చెందిన దుంపల సాయికి తీవ్రగాయాలయ్యాయి ఆయనను మేరుగైన చికిత్సనిమిత్తం 108 ఈఎంటి సుంకరి విజయ్‌కుమార్, పైలెట్ శ్రీనివాస్ ప్రథమచికిత్స నందిస్తూ మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. హైదరాబాద్ ఏర్‌పోర్టు నుంచి తన స్వగ్రామం రాజేశ్వర్‌రావుపేట్‌కు కారులో వెళ్తుండగా కమ్మర్‌పల్లి గ్రామశివారులో లలితాపీఠాశ్రమంవద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ కంఠీంనగర్ డిపో 2కు చెందిన బస్సు కారును బలంగా ఢీకొట్టింది కారులో ఉన్న సాయిలు తీవ్రంగ గాయపడ్డాడు సంఘటన స్థలం చేరుకున్న కమ్మర్‌పల్లి ఎస్సై అనీల్ రెడ్డి కేసునవెదు చేసుకుని దర్యప్తు చేస్తున్నట్లు జాతీయరహదారిపై ఏర్పడ్డ ఆడుగులోతు గుంతలను తప్పించబోయి ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

ముప్కాల్, అక్టోబరు, 1(ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా కుటుంబ కలహాలతో రాంబర్తి మమత(38) మృతిచెందిన సంఘటన బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన బాల్కొండ ఎస్సై శైలేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కిసాన్‌నగర్‌కు చెందిన నరేష్ భార్య మమత గత కొంతకాలంగా కుటుంబ కలహాలు ఉన్నాయని జీవితంపై విరక్తి చెంది మంగళవారం అర్ధరాత్రి అందరు పడుకున్న సమయం చూసి ఇంటినుంచి బయలుదేరి ఇంటి సమీపంలో గల ఎస్సారెస్పీ వరద కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు, బుధవారం ఉదయం వరదకాలువలో గాలింపు చర్యలు చేపట్టగా వలకు చుట్టుకొని మృతదేహం బయటపడినట్లు ఆయన తెలిపారు. మృతురాలి తమ్ముడు భూస సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

జోరుగా కొనసాగిన మాంసం విక్రయాలు

బోధన్,అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): విజయ దశమి, గాంధీ జయంతి ఒకే రోజు రావడంతో మాంసం ప్రియులు ఒకరోజు ముందస్తుగానే మటన్, చికెన్ కొనుగోళ్లకు బారులు తీరారు. బోధన్ పట్టణంలో బుధవారం చికెన్, మటన్ షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.ఉదయం నుంచి సాయంత్రం వరకు మాంసాహారాన్ని కొనుగోలు చేశారు. గురువారం గాంధీ జయంతి ఉండడంతో జిల్లా కలెక్టర్ మాంసం విక్రయాలపై నిషేధాజ్ఞాలు విధించారు. దీంతో మాంసం ప్రియులు దసరా ముందు రోజే పెద్దలకు మాంసాహారం పెట్టే సంప్రదాయాన్ని దృష్టిలో పెట్టుకుని కొనుగోలు చేశారు. రాత్రి వరకు రద్దీ కొనసాగింది. ఒక్కరోజులోనే లక్షలాది రూపాయల మాంసం విక్రయాలు పెద్ద ఎత్తున కొనసాగడం విశేషం.

కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిని
సన్మానించిన బీజేపీ నాయకులు



బస్వా లక్ష్మీనర్సయ్యను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నవీపేట,అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు బస్వా లక్ష్మీనర్సయ్యను బుధవారం మండల బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో శాలువా, పూలమాలతో సన్మానించారు. ఇటీవల బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా బస్వా లక్ష్మీనర్సయ్య నియామకం కావడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సరిన్, శ్రీకాంత్, రాధ, రాజేందర్ గౌడ్, ఆనంద్, రాజశేఖర్, భాను గౌడ్ తదితరులున్నారు.


దుర్గామాత మండపం
వద్ద రక్తదానం చేసిన యువకులు



అబ్బాపూర్‌లో(ఎం) రక్తదాన చేసిన యువకులు

నవీపేట,అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బాపూర్(ఎం)లో బుధవారం దుర్గామాత మండపం వద్ద యువకులు రక్తదానం చేశారు. శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గ్రామంలో కొలువైన దుర్గామాత మండపం వద్ద స్థానిక యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన 15మంది యువకులను స్థానికులు శాలువా, మెమోంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు



ఏరియా ఆస్పతిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు వైద్యులు

ఆర్మూర్ టౌన్ సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని పలు వార్డుల్లో బుధవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు రంగురంగుల పూలను పేర్చి బతుకమ్మలను తయారు చేశారు.అలాగె ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో మహిళ వైద్యులతో పాటు సిబ్బంది బతుకమ్మను పేర్చి ఆటపాటలతొ నృత్యాలు చేస్తూ సమీప చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రమిద, డాక్టర్లు స్నేహ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్‌రహిత సమాజం కోసం బైక్ యాత్ర



యాత్రికునికి శాలువతో సన్మానం చేసిన డిప్యూటీ డైరెక్టర్

నిజామాబాద్‌లీగల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బంగారు భవిష్యత్ నిర్మించుకోవాలసిన యువతరం గంజాయి,డ్రగ్స్ వ్యసనాలను దరిచేయనీయరాదనీ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య తెలిపారు.సూర్యాపేట జిల్లాకేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తు న్న రాచకొండ ప్రభాకర్ గంజాయి డ్రగ్స్‌రహిత సమాజం కోసం నిర్వహిస్తున్న బైక్ ప్రచార యాత్ర తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాలో తిరిగి నిజామా బాద్ చేరుకున్న సందర్భంగా నిజామాబాద్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాణిక్ రాజు ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం ఘనస్వాగతం పలికింది. యాత్ర విశేషాలు, విశిష్టతను, ప్రాముఖ్యాన్ని రాజు వివరించగా లక్ష్మీనర్సయ్య ప్రధానోపన్యాసం చేశారు. ఒకవ్యక్తి ఎందరో వ్యక్తులకు ఆదర్శంగా నిలవడానికి ఒంటరిగా బైక్ యాత్రకు బయలుదేరి ప్రచారం చేయడం సాహసమేనని అన్నారు. మత్తు పదార్థాల అలవాటు జీవితాలను చిత్తు చేస్తాయని, చిత్తం అంత విద్యార్థులది చదువుపైన, యువతరానిది ఆర్థిక ఎదుగుదలపైన ఉండాలని ఆయన అన్నారు. మత్తు పదార్థాల అక్రమ వినియోగ నిరోధక చట్టాలు చాలా బలంగా ఉన్నాయని,శిక్షలు, జరిమానాలు న్యాయస్థానాలు విధిస్తే పౌరుల జీవితాలు అగమ్య గోచరమేనని పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ కలిగి ఉన్న, అక్రమ రవాణా చేసిన, సేవించిన నేరాలేనని తెలిపారు. వాటికి దూరంగా ఉంటు మంచి జీవన శైలిని అలవర్చుకోవాలని, ఆరోగ్యకరమైన జీవన విధానంతో దేశ ప్రగతికి ఆదర్శప్రాయులుగా నిలవాలని లక్ష్మీ నర్సయ్య కోరారు.నిజామాబాద్ నగర సీఐ శ్రీనివాస్ రాజు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ అనేవి మనుషులను రెండు దిక్కుల, వేరువేరు దిశలలో పోయే ప్రమాదం ఉన్నదని దాని వలన జీవన చిత్రం ఎటు కాకుండా పోతుందని అన్నారు.

రాచకొండ ప్రభాకర్ మాట్లాడుతూ తన స్నేహితుడు గంజాయి, డ్రగ్స్‌కు బానిసగా మారి మృతి చెందా డని మరెవరు ఆ తీరుగా మరణించ రాదనే లక్ష్యంతో పాటు సమాజానికి తనవంతు సా మాజిక సేవను అందిస్తున్నట్లు తెలిపారు. ఈకార్య క్రమంలో న్యాయ వాదులు ఆశనారాయణ, శ్యామ్ పాలొ ్గన్నారు.

ఘనంగా చండీయాగం



ఆర్మూర్‌లో చండీయాగం నిర్వహిస్తున్న దృశ్యం

ఆర్మూర్ టౌన్ ,అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీల్లో ఎర్పాటు చేసిన దుర్గమాత మండపాల వద్ద బుధవారం మహ చండీయాగలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని లక్ష్మినారాయణ మందిరం, త్రిపుర యూత్, లక్ష్మి నరసింహ ఆలయం, మామిడిపల్లిలోని శివాజీ యూత్ వద్ద వేద పండితులు చండీ హోమం నిర్వహించారు. ఆనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ దుర్గమాత మండపాల నిర్వహకులు పాల్గొన్నారు.

దుర్గాదేవి వద్ద
కుంకుమార్చణ, యజ్ఞం



చింతలూర్‌లో ..

జక్రాన్ పల్లి: మండలంలోని చింతలూర్ గ్రామంలో దుర్గాదేవి మండపంలో బుధవారం యజ్ఞం నిర్వహించారు. భక్తులు యజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దుర్గాదేవి శోభయాత్ర పల్లకీ సేవా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కు లు తీర్చుకున్నారు. దుర్గాదేవి మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో కొలిప్యాక్ సొసైటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్, దుర్గాదేవి మండపం సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రూ.2వేల కోసం హత్య

▸▸ నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



నిందితుడితో ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి, సిబ్బంది

ఇందూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గతనెల 6న గుర్తుతెలియని మృతదేహం పడి ఉన్నట్లు ఫిర్యాదు అందగా 1వ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయగా అది సాధారణ మరణం కాదు హత్యగా ధృవీకరించారు. రూ.2వేల కోసం గుర్తుతెలియని వ్యక్తిని షేక్ షైమద్ అనే వ్యక్తి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు విచారణ జరుపగా బుధవారం నింధితుడు తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు 1వ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. కోటగిరి మండలం జల్లపల్లి ఫారంకు చెందిన షేక్ షైమద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో నివసిస్తూ క్యాటరింగ్, రోజువారి కూలీ చేస్తూ మద్యం అలవాటు కారణంగా ఒంటరిగా కనిపించే వ్యక్తులను బెదిరించి డబ్బులు దోచుకునేవాడు. ఈక్రమంలో గత నెల 6న రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న లాడ్జ్ వద్ద ఓ ముసలాయన డబ్బులు లెక్కపెడుతూ కనిపించగా అతన్ని చంపైనా సరే డబ్బులు దోచుకోవాలనే ఉద్దేశ్యంతో అతని దగ్గరకు వెళ్లి డబ్బులు ఇవ్వమని బెదిరించగా అతను ససేమీర అనడంతో బట్టతో గొంతు భిగించి హత్య చేసి రూ.2వేలతో పాటు ఫోన్ దొంగిలించాడు. విచారణలో తాను హత్య చేసినట్లు షేక్ షైమద్ ఒప్పుకోగా అతన్ని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో
జవాన్, కిసాన్‌లకు సన్మానం



కోటగిరిలో రిటైర్డ్ జవాన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కోటగిరి,అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ సాయి అయ్యప్ప దేవాలయంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం, టీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలో ఉత్తమ రైతులతో పాటు దేశ సేవలో సైనికుడిగా విధులు నిర్వహించిన పలువురిని ఘనంగా సన్మానించారు. కెప్టెన్ సాయిలు, కోటగిరి గ్రామానికి చెందిన రాజుతో పాటు రైతులు నర్సింలు, లక్ష్మయ్యలను ఘనంగా సన్మానించారు. వీరితో పాటు ప్రముఖ వేద పండితులు నాగనాథ్ శాస్త్రి, రంగారావు, రాజు, పోల కుసుమ, విఠల్ గుప్తాలతో పాటు పలువురిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోటగిరి సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు తాటి వీరేశం, బర్ల సత్యనారాయణ, గంగాధర్ రావు దేశ్‌ముఖ్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రసూల్ బీతో పాటు పలువురు పాల్గొన్నారు.

దుర్గామాత నిమజ్జనానికి
ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

రెంజల్,అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం దుర్గామాత నిమజ్జనాన్ని రెంజల్ మండలంలోని గ్రామాలతో పాటు చుట్టు పక్కల గ్రామాల వారు కందకుర్తి గోదావరి పుష్కర ఘాట్ల వద్ద నిమజ్జనం చేశారని, ఈ సారి వరద ప్రవాహంతో పూర్తిగా పుష్కర ఘాట్‌లు నీట మునగడంతో వరద ఉధృతి అధికంగా ఉండడంతో ఇటు వైపుగా రాకపోకలు నిలిచిపోవడంతో దుర్గామాత నిమజ్జన ఏర్పాట్లకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని తహసీల్దార్ శ్రావణ్ కుమార్ సూచించారు. కందకుర్తికి దుర్గామాత విగ్రహాలను తరలించకుండా బాసర గోదావరిలో నిమజ్జనానికి దుర్గామాతలను తరలించాలని సూచించారు. భారీ వరద ప్రవాహం వల్ల నిమజ్జనం చేసే వీలు లేకపోవడంతో దుర్గామాత మండప నిర్వాహకులు బాసర గోదావరికి నిమజ్జనానికి తరలించాలని సూచించారు. కందకుర్తి వైపు ఎవరు కూడా రావద్దని సాటాపూర్ చౌరస్తా వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని పోలీసుల శాఖకు సూచించారు. కందకుర్తి వచ్చే వారు ఇటు వైపుగా రాకూడదని సూచించారు.

నేడు ఆర్యసమాజ్ ఆవరణలో యజ్ఞం

మద్నూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతి ఏడాది నిర్వహించే విజయదశమి వేడుకలకు ఆర్య సమాజ్ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్య సమాజ్ ప్రతినిధులు రాజేందర్ గోజే, సోపాన్ రావు వెల్లడించారు. గురువారం విజయదశమి సందర్భంగా ఆర్య సమాజ్ భవన్ నుంచి సాయంత్రం శోభాయాత్ర ఉంటుందని, ఎల్లమ్మ గుట్ట ప్రాంతంలో రావణ దహన కార్యక్రమం జరిగిన అనంతరం ముగుస్తుందని తెలిపారు. ఉదయం ఆర్య సమాజ్ ప్రాంగణంలో యజ్ఞ కార్యక్రమాలను నిర్వహిస్తామని, సనాతన ధర్మం పాటించే ప్రతి ఒక్కరు యజ్ఞ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. సాయంత్రం రావణ దహన కార్యక్రమానికి వేలాదిమంది తరలిరానున్న నేపథ్యంలో ప్రతి ఏడాది లాగే రావణ బొమ్మను తయారుచేసి రావణ దహనానికి ఏర్పాట్లుచేశామన్నారు.

కొనుగోలు కేంద్రాలు షురూ

మద్నూర్, జుక్కల్, బీర్కూర్, నసురుల్లా బాద్, నిజాంసాగర్, ఎల్లారెడ్డి, అక్టోబరు 1 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలం లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఏపీఎం జగదీష్ తెలిపారు. డోంగ్లి మండలంలోని కుర్లా, ఎంబుర, మదన్ హిప్పర్గ, మద్నూర్ మండలంలోని సుల్తాన్ పేట్, గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించా మన్నారు. ప్రభుత్వ మ ద్దతు ధర ఏ-గ్రేడ్ రకం రూ.2389, కామన్ రకం రూ.2369 ఉంటుందని వెల్లడించారు.

● జుక్కల్ మండలం కండేబల్లూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జుక్కల్ ఐకేపీ ఏపీఎం గంగారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామ సంఘం అధ్యక్షురాలు పూర్ణమ్మ, శాంతమ్మ, సీసీలు సంజు, తుకారం రాములు రైతులు పాల్గొన్నారు.

● బీర్కూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం బీర్కూర్, బరంగ్ ఏడ్గి, కిష్టాపూర్, చించొల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను విండో సీఈఓ విఠల్ ప్రారంభించారు. ఐకేపీ ఆధ్వర్యంలో బైరాపూర్, కిష్టాపూర్, తిమ్మాపూర్ గ్రామాల లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ సాయిభుజంగరావు ప్రారంభిం చి పలు సూచనలు చేశారు.

● నస్రులాబాద్ మండలం మైలారంలో సొసైటీ కార్యదర్శి నరేందర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

● ఎల్లారెడ్డి సొసైటీ ఆధ్వర్యంలో గండి మాసానిపేట్ వద్ద ఆర్డీవో పార్థసింహారెడ్డి కొనుగోలు కేంద్రాన్ని ప్రారం భించారు.

● నిజాంసాగర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని అచ్చంపేట, ఆరేడు, గోరుగల్లు, మంగళూరు, నర్సింగ్ రావు పల్లి, వెంగళూరు గ్రామాలలో సంఘ సీఈవో సంగమేశ్వర్ గౌడ్ ప్రారంభించారు. ఇందిరా కాంతి పథకం కింద బంజపల్లి, సుల్తాన్‌నగర్, మాగి గ్రామాల్లో ఐకేపీ ఏపీఎం ప్రసన్న రాణి ప్రారంభించారు.

బార్ అసోసియేషన్
ఉపాధ్యాక్షుడిగా రెంజర్ల సురేష్



రెంజర్ల సురేష్‌ని శాలువతో సన్మానించిన న్యాయావాదులు

నిజామాబాద్ లీగల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి):చరిత్రాత్మకమైన జిల్లా బార్ అసోసియేషన్ ఉపాధ్యాక్షుడిగా విధులను స్వీకరించడం అదృష్టంగా భావిస్తున్నట్లు రెంజర్ల సురేష్ తెలిపారు. నిజామాబాద్ జిల్లాకోర్టు ప్రాంగణంలోని నిజామాబాద్ బార్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ... బార్ బరువు బాధ్యతలలో నేను సైతం పాల్గొని, న్యాయవాదుల అభ్యున్నతికి పాటు పడతానని అన్నారు. ఈ సందర్భంగా బార్ ప్రధాన కార్యదర్శి మాణిక్ రాజు మాట్లాడుతూ.. గత మార్చి నెలలో నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నికలలో దిలీప్, సురేష్‌లకు సరి సమానంగా ఓట్లు లభించడంతో చేరి ఆరు నెలల పదవీ కాలంగా నిర్ణయం తీసుకోవడం జరిగిందని అన్నారు. మొదటి విడతలో దిలీప్ ఉపాధ్యక్షుడిగా విధులు నిర్వహించారని అక్టోబరు నుంచి మార్చి2026 వరకు సురేష్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తారని ఆయన అన్నారు. కార్యక్రమంలో గవర్నమెంట్ ప్లీడర్ అమిదాల సుదర్శన్,బార్ కోశాధికారి నారాయణ దాసు,సీనియర్ న్యాయవాదులు ఆకుల రమేష్,ఆనంద్‌రెడ్డి, బిర్లా రామరావు, బాసరాజేశ్వర్, సురేష్ బాబు,జక్కుల వెంకటేశ్వర్, సుదర్శన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, ఎమ్.ఎ ఖయ్యూమ్, ఆశ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యంలో శ్రీవల్లికి
మలేషియాలో అరుదైన గౌరవం



వేల్పూర్‌లో శ్రీవల్లిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, అక్టోబరు, 1(ఆంధ్రజ్యోతి): సావిత్రి బాయి ఉమెన్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 28న మలేషియాలో నిర్వహించిన బతుకమ్మ, దసరా సంబురాలలో భాగంగా నిర్వహించిన శాస్త్రీయ నృత్య పోటీలలో వేల్పూర్ గ్రామానికి చెందిన కోమన్‌పల్లి శ్రీవల్లికి అరుదైన గౌరవం లభించింది. కూచిపూడి ఆంధ్రనాట్యం శ్రీవల్లి అద్భుత ప్రతిభ కనబర్చింది. ఈ సందర్భంగా బుధవారం వేల్పూర్‌లో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శ్రీవల్లిని శాలువతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన శ్రీవల్లి శాస్త్రీయ నృత్యంలో ఇంకా బాగా రానిస్తు భారతీయ సంసంస్కృతి సాంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసేలా కృషి చేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

కల్లు ధరల పెంపుపై నిరసన

బోధన్,అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో కల్లు ధరలను పెంచడంపై కల్లు ప్రియులు ఆందోళన చేపట్టారు.కల్లు షాపుల ఎదుట ధరల పెంపును నిరసిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్లు సీసా ధర రూ.12 ఉండగా ఒక్కసారిగా రూ.14 కు పెంచడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.కల్లు ముస్తేదారులు ధరలను పెంచుతూ సామాన్యులపై భారం మోపడం సరికాదని వారు మండిపడ్డారు. పెంచిన ధరలను తక్షణమే తగ్గించాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అలైయ్ బలైయ్‌ని విజయవంతం చేయండి

-రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్,అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ రంగాలు, ప్రముఖులు, కార్యకర్తలు అలైయ్ బలైయ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3న పెర్కిట్ కామాక్షి ఫంక్షన్‌హాల్‌లో అలైయ్ బలైయ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

భక్తి శ్రద్ధలతో
దుర్గామాత నిమజ్జనం

ముప్కాల్, అంక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాలలో భాగంగా తొమ్మిది రోజులు పూజలందుకున్న దుర్గామాత నిమజ్జన మహోత్సవం బుధ వారం ముప్కాల్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. దుర్గామాతకు వేద మంత్రాలతో పూజలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి పురవీధుల గుండా శోభయాత్రగా మహిళల కోలాటాలు, దాండి నృత్యాల మధ్య ఊరేగింపుగా వీడ్కోలు పలికారు. దుర్గామ్మ వెళ్లిరామ్మ అంటు వైభవంగా చెరువులో నిమజ్జనం చేశారు. నవరాత్రులు ఉపవాస దీక్షను పాటించిన భక్తులు నిమజ్జనానంతరం తీర్థప్రసాదాలు తీసుకొని దీక్షను విరమించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండప నిర్వాహకులు, కమిటి సభ్యులు, హిందు పరిరక్షణ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

నవీపేటలో దుర్గామాత శోభాయాత్ర

నవీ పేట: మండల కేంద్రంలో దుర్గామాత శోభాయాత్రను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక భక్త మార్కండేయ మందిరం ఆవరణలో ఉన్న దుర్గామాత మందిరం, శివాజీ నగర్‌లోని పెద్దమ్మ ఆలయంలో కొలువైన దుర్గామాత విగ్రహాలను వేర్వేరుగా ప్రత్యేక రథాలలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

దాత సహకారంతో కమ్మర్‌పల్లి
పారిశుధ్య కార్మికులకు నగదు పంపిణీ



కమ్మర్‌పల్లిలో పారిశుధ్య కార్మికులకు నగదు అందజేస్తున్న వీడీసీ సభ్యులు

కమ్మర్‌పల్లి,అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి)కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ఎన్నారై గుగ్గిలం దేవరాజ్ సహకారంతో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో దసరా కానుకగా గ్రామ పారిశుధ్య కార్మికులకు నగదును వీడీసీ అధ్యక్షుడు బోగ రామస్వామి, కోశాధికారి బుచ్చిమల్లయ్య, కమిటీ సభ్యులు బుధవారం పంపిణీ చేశారు. గ్రామ ఎన్నారై గుగ్గిలం దేవరాజ్ గత కరోనా సమయంలో పారిశుధ్య కార్మికులు సౌకర్యార్థం కొంత నగదును బ్యాంక్‌లో డిపాజిట్ చేసి అట్టి డబ్బులపై ప్రతీఏడాది వడ్డీ రూపేన వచ్చే సుమారు 80 నుంచి రూ.82 వేల మొత్తాన్ని గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఇచ్చే ఆనవాయతీ కొనసాగుతువస్తుంది. ఇందులో భాగంగా బుధవారం సానిక లక్ష్మీనారసింహస్వామి ఆలయంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు బోగరామస్వామి,కోశాధికారి బుచ్చిమల్లయ్య కమిటీ సభ్యుడు గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు, ఉద్యో గులకు అందజేశారు. కరోనా సమయం నుంచి ఇప్పటివరకు ప్రతీ ఏడాది తమను డబ్బు రూపేన అందుకుంటున్న దాత ఎన్నారై గుగ్గిలం దేవరాజ్‌కు, వీడీసీ సభ్యులకు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

విజయదశమి పండుగ
సందర్భంగా ప్రముఖుల శుభాకాంక్షలు

సుభాష్‌నగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి):విజయదశమి పండుగ సందర్భంగా జిల్లాకు చెందిన ప్రముఖులు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, రాకేష్‌రెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, పోలీస్ కమీషనర్ సాయిచైతన్య, కార్పొరేషన్ చైర్మన్లు మానాల మోహన్‌రెడ్డి, ఈరవత్రి అనిల్, తాహెర్‌బిన్ హుందాన్, అన్వేష్‌రెడ్డి, వ్యవసాయ కమీషన్ సభ్యుడు గడుగు గంగాధర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్, తదితరులు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. విజయదశమి అందరి జీవితాలలో విజయాన్ని, సంతోషాన్ని నింపాలని వారు ఆకాంక్షించారు.



కాకతీయ కాలువపై ఇరుకుగా ఉన్న వంతెన



వంతెనపై ఏర్పడిన గుంతలు

వంతెన విస్తరణ చేయరేం?

● ప్రమాదాలకు దారితీస్తున్న వంతెన ● వాహనదారులకు ఇక్కట్లు ● పట్టించుకోని అధికారులు

ఏర్గట్ల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి మోర్తాడ్ మండలానికి వెళ్లే దారిలో కాకతీయ కెనాల్‌పైన నిర్మించిన వంతెన ఇరుకుగా ఉండటం వల్ల ప్రమాదాలకు దారి తీస్తోంది. ఈ వంతెన మీదుగానే మండలంలోని పుష్కర ప్రదేశాలైన తడపాకల్, గుమ్మిర్యాల్, దోంచంద వేల సంఖ్యలో భక్తులు గోదావరి నదికి వెళతారు. ఏర్గట్ల మండలంగా ఏర్పడినప్పటి నుంచి వాహన దారుల సంఖ్య రోజు రోజుకూ పెరిగి నిత్యం రద్దీగా ఉండటం వల్ల రాకపోకలకు వాహదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. వంతెన ఎత్తుగా ఉండటం, వంతెన వద్ద ప్రమాదకర మలుపు ఉండటంతో నిత్యం ప్రమాదాలకు దారి తీస్తుంది. గతంలో ఈ వంతెన వద్ద ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. వంతెన ఇరుకుగా ఉండటం వంతెన మీద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వంతెన ఇరుకుగా ఉండటం వల్ల భారీ వాహనాలు వస్తే మరో వాహనం వెళ్ళలేని పరిస్థితి. ఈ వంతెనపై వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించిన వంతెనపై ఉన్న గుంతల వల్ల ప్రమాదం బారీన పడాల్సిందేనని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు వ్యవసాయ ఉత్పత్తులైన ధాన్యం, వరిగడ్డి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు ట్రాక్టర్‌ల ద్వారా ఈ వంతెన ద్వారా రవాణా చేస్తుంటారు. వంతెన మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇరుకుగా ఉన్న వంతెనను వెడల్పుగా చేయాలని వాహనదారులు, మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వంతెన ఇరుకుగా ఉంది..

అట్ల పోచయ్య, గ్రామస్థుడు, ఏర్గట్ల



మండల కేంద్రం నుంచి మోర్తాడ్‌కు వెళ్లే దారిలో కాకతీ యకాలువపై ఉన్న వంతెన ఇరుకుగా ఉండటం వల్ల ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఈ వంతెన ఎత్తుగా ఉండి రోడ్డు కిందికి ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని గమనించక ప్రమాధాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు సంబంధిత శాఖ అధికారులు వంతెన వెడల్పు ఏర్పాటు చేపట్టాల్సిన అవసరం ఉంది.

విద్యుత్ ప్రమాదం.. అప్రమత్తతే కీలకం!

- రైతులు, మూగ జీవాలకు ముప్పు
- జాగ్రత్తలు పాటించాలని అధికారుల సూచన

బోధన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉదయం లేచిన నుంచి మొదలు రాత్రి పడుకునే వరకు విద్యుత్ ఉపకరణాలు వినియోగిస్తాం. కనీస జాగ్రత్తలు పాటించకుంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. అసలే వర్షాకాలం బయట విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా జరుగుతుంటాయి. గాలివానకు విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, విద్యుత్ వైర్లు తెగిపోతుంటాయి. ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులు, విద్యుత్ సిబ్బంది కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ఉంటారని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ప్రమాదాలకు గల కారణాలు

- గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఇళ్ల మధ్యన, జన సంచారం ఉన్న ప్రాంతాల్లో ఉండి వాటికి చుట్టు కంచె లేకపోవడం.
- గ్రామాల్లో ఇళ్లపైనుంచి ప్రమాదకరంగా విద్యుత్ తీగలు ఉండడం.
- వ్యవసాయ బావులు, పంట పొలాల్లో చేతికంటే ఎత్తులో కర్రలపై ప్రమాదకరంగా విద్యుత్ తీగలు ఉండడం.
- వర్షాకాలంలో ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడడం వల్ల విద్యుత్ స్తంభాలు ఒక వైపు వంగడం, విరిగిపోవడం వంటి ప్రమాదాలకు కారణమవుతాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్న తీరు

- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫీజ్ వైర్లు మార్చడం, చిన్నచిన్న మరమ్మత్తులు చేస్తున్నప్పుడు విద్యుత్ సరఫరా అయి ఉండడం వల్ల విద్యుత్ షాక్‌కు గురి కావడం.
- వర్షాకాలంలో ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, తీగలు తెగి పడడంతో ప్రమాదాలు జరుగుతాయి.
- వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ స్తంభం నుంచి స్టార్టర్ డబ్బాలోకి ఉండే కనెక్షన్ సరైన వైరింగ్ లేకపోవడం వల్ల ఎమడపాటుతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది.
- స్టార్టర్ డబ్బా నుంచి బోరు బావి మోటార్లకు వెళ్లే విద్యుత్ వైర్ కనెక్షన్ పొదల్లో ఉండి గడ్డి కోసేటప్పుడు ప్రమాదాలు జరుగుతాయి.



బోధన్ పట్టణంలో మరమ్మతులు చేస్తున్న దృశ్యం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- విద్యుత్ స్తంభాలు తెగిపడిన విద్యుత్ తీగలను తాకకూడదు.
- తడి చేతులతో విద్యుత్ స్విచ్‌లు, పరికరాలను ముట్టుకోవద్దు.
- పశువులకు విద్యుత్ స్తంభాలకు సమీపంలో గడ్డి వేయవద్దు
- పంట పొలాల వద్ద బావి తోడే మోటార్లు వాడేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సొంతంగా మరమ్మతులు చేయవద్దు
- నాణ్యమైన స్టార్టర్ డబ్బాలు, సర్వీస్ వైర్లు వాడాలి
- విద్యుత్ స్తంభం నుంచి స్టార్టర్ డబ్బా నుంచి బోరు బావి మోటార్లకు వెళ్లే విద్యుత్ కనెక్షన్‌కు సరైన వైరింగ్ ఉండేటట్లు చూసుకోవాలి.
- ఉరుములు, మెరుములతో వర్షం కురిసే సమయంలో ఇంట్లోని టీవీ, కంప్యూటర్‌లు ఆఫ్ చేసి ఉంచాలి.

విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి..

ముక్తార్ హైమద్, ట్రాన్స్‌కో డీఈ



ఎక్కడైన విద్యుత్ సమస్యలు వస్తే వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గ్రామాలలో వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ సమస్యలు ఏర్పడితే సొంతంగానే మరమ్మతులు చేస్తున్నారు. దీంతో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయి.

మద్యం దుకాణాలకు 5 దరఖాస్తులు

సుభాష్‌నగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలకు బుధవారం 5 దరఖాస్తులు నమోదు అయ్యాయి. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను నమోదు చేశారు. మంగళవారం వరకు మొత్తంగా 9 దరఖాస్తులు రాగా బుధవారం 5 దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా ఇప్పటి వరకు 102 మద్యం దుకాణాలకు 14 దరఖాస్తులు నమోదైనట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు.



బాటిల్‌తో ఇరుక్కుపోయిన తలతో రోడ్డుపై తిరుగుతున్న కుక్క

ఎరక్కపోయి ఇరుక్కపాయే!

రుద్రూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జేఎన్‌సీ కాలనీలో బుధవారం కుక్క ఒక బాటిల్‌లో ఉన్న పదార్థాలను తినేందుకు ప్రయత్నించగా కుక్క ముఖం బాటిల్‌లో చిక్కుకుంది. ప్లాస్టిక్ బాటిల్ ముఖం నుంచి తొలగిపోకపోవడంతో కుక్క రోడ్డు వెంట అయోమయంగా పరుగులు తీసింది. రోడ్డు వెంట కుక్క తిరుగుతుండగా ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించింది.

ఏడు నెలలుగా అతిథి అధ్యాపకులకు అందని వేతనాలు

● కుటుంబ పోషణ జరిగేదేలా ?
● ఆవేదన చెందుతున్న అతిథి అధ్యాపకులు



ప్రభుత్వ సలహాదారుడు వేం. నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అతిథి అధ్యాపకులు (ఫైల్)

ఆర్మూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు ఏడు నెలలుగా వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతు న్నారు. ప్రతీనెల ప్రభుత్వం వేతనాలు ఇవ్వకపోవడంతో మరోక పని చేసుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారు. సకాలంలో వేతనాలు ఇవ్వకుంటే పెరుగుతున్న నిత్యవసర ఖర్చులు, పిల్లల విద్యాభ్యాసం, ఖర్చులు ఏలా నెట్టుకొచ్చేదని వారు మదనపడుతున్నారు. అతిథి అధ్యాపకులకు గత విద్యాసంవత్సరంలో డిసెంబరు నుంచి మార్చి వరకు నాలుగు నెలలు ఈ విద్యా సంవత్సరంలో జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన వేతనాలు రావల్సి ఉంది. ఏప్రిల్, మే నెలలో వేసవి సెలవుల దృష్ట్యా వీరికి వేతనాలు అందవు. రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న ప్పటికీ ప్రభుత్వం వీరి పట్ల చిన్నచూపు చూస్తోందన్న విమర్శలు వస్తున్నాయి.

వేతనాలు తక్కువ.. పని భారం ఎక్కువ

అతిథి అధ్యాపకులకు వేతనాలు తక్కువ ఇస్తున్నప్పటికీ పనిభారం మాత్రం ఏక్కువే. అన్ని అర్హతలు పరిశీలించాకే అతిథి అధ్యాపకులుగా ఎంపిక చేస్తారు. త్రిసభ్య కమిటీ వీరి పీజీ సర్టిఫికేట్‌లు, మార్కుల శాతం పరిశీలించి డెమోలో చూపిన ప్రతిభ ఆదారంగా ఎంపిక చేస్తారు. రోజు నాలుగు తరగతులు బోధించాల్సి ఉంటుంది.

ఉద్యోగ భద్రత కరువు..

అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. ఏదైనా కళాశాలలో రెగ్యులర్ అధ్యాపకులు బదిలీపై వస్తే సంబంధిత సబ్జెక్టులు బోధించే వారు ఇంటికి వెళ్లాల్సిందే.

రావణ దహన ఏర్పాట్ల పరిశీలన

బాన్సువాడటౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలోని మినీ స్టేడియంలో దసరా పండుగ రోజున ఏటా రావణ దహనం నిర్వహిస్తారు. కాగా ఈ యేడు గురువారం నిర్వహించనున్న రావణ దహణ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను బుధవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు.

● దసరా పండుగ శుభాకాంక్షలు

బాన్సువాడ నియోజకవర్గ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

జీపీవోల కార్యవర్గం

సదాశివనగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామ పాలన అధికారు ల నూతన కార్యవర్గాన్ని బుధవారం త హసీల్దార్ కార్యాలయం వద్ద ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా గ్యార సాయిలు(యాచారం), ఉపాధ్యక్షుడిగా కారంపూరి శ్రీనివాస్ (సదాశివనగర్), ప్రధా న కార్యదర్శిగా సంఘీ స్వామి (భూంపల్లి) ఎన్నికయ్యారు.

మంచిప్ప 21 ప్యాకేజీ పనులు చేపట్టాలి


సమావేశమైన ఏఐకేఎంఎస్ నాయకులు

మోపాల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మంచిప్ప 21 ప్యాకేజీ పనులను వెంటనే చేపట్టాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. బుధవారం మోపాల్ మండల కేంద్రంలో ఏఐకే ఎంఎస్ ఆధ్వర్యంలో రైతు పొలం వద్ద సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు నిర్మాణం అయ్యేంతవరకు ఉద్యమిస్తామన్నారు. అర్థాంతరంగా మధ్యలో ఆపేసిన 21 ప్యాకేజీ పనులను వెంటనే పునరుద్ధరించాలని అన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో గడ్కోల్ సెగ్మెంట్‌లో 84వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. సాగునీరు అందక ఈ ప్రాంత రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ ప్రాజెక్టు పనులను వెంటనే పునరద్దురించి రైతాంగానికి సాగునీరు అందించాలని అన్నారు. పనులను త్వరలో చేపట్టకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. 2018లో ఈ ప్రాజెక్టు పథకాన్ని ప్రారంభించారని మరో 2వేల కోట్లు ఖర్చు పెడితే ఆగిపోయిన పనులు పూర్తవుతాయని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పథకం ద్వారా నియోజకవర్గంలోని ఏడు మండలాలకు సాగునీరు అందుతుందని అన్నారు. ప్రజాపాలనలో రైతురాజ్యం, రైతు నేస్తం అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈ ప్రాంత రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ప్రాజెక్టు పనులు ప్రారంభించడంలో వెనుకంజ వేయడం పట్ల ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని పనులు పూర్తయ్యే విధంగాచూడాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అగ్గు ఎర్రన్న, సహాయ కార్యదర్శి చిన్నయ్య, రైతు నాయకులు, మాజీ సర్పంచ్ దండునర్సయ్య, గోవర్ధన్, భూమయ్య, మంగళ్ పాడ్ చిన్నగణేష్‌కైలాష్, తిరుపతి, పోశెట్టి, రమేష్, పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌లో రూ.299కే అన్‌లిమిటెడ్ కాల్స్, 4జీ డేటా సేవలు

సుభాష్‌నగర్,అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):భారతదేశంలో స్వదేశీ పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌తో రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా రూ.299లకే ఉచిత ఫోన్‌కాల్స్, 4జీ డేటాను అందుబాటులోకి తెచ్చామని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లాకేంద్రంలోని గాంధీచౌక్‌లోగల బీఎస్ఎన్ఎల్ జిల్లా కార్యాలయంలో 25 వసంతాలు పూర్తిచేసుకొని 26వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకల కేక్‌ను కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జీఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 4నెలల్లోపు బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన సిగ్నల్ టవర్స్‌ను ఏర్పాటు చేసిమారుమూల ప్రాంతాలలో సైతం బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సేవలను అందిస్తామని తెలిపారు. బీఎస్ఎన్ఎల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ సిబ్బంది, డిస్ట్రిబ్యూటర్లు, తదితరులు పాల్గొన్నారు.

కల్లు ధర పెంపుపై నిరసన

బోధన్,అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో కల్లు ధరలను పెంచడంపై కల్లు ప్రియులు ఆందోళన చేపట్టారు.కల్లు షాపుల ఎదుట ధరల పెంపును నిరసిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్లు సీసా ధర రూ.12 ఉండగా ఒక్కసారిగా రూ.14 కు పెంచడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.కల్లు ముస్తేదారులు ధరలను పెంచుతూ సామాన్యులపై భారం మోపడం సరికాదని వారు మండిపడ్డారు. పెంచిన ధరలను తక్షణమే తగ్గించాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

భూపతిరెడ్డిని పరామర్శించిన షబ్బీర్ అలీ


భూపతిరెడ్డిని పరామర్శిస్తున్న షబ్బీర్ అలీ

ఇందూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ బుధవారం పరామర్శించారు. సోమవారం భూపతిరెడ్డి తల్లి లక్ష్మీనర్సమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె మరణించిన వార్త తెలుసుకున్న షబ్బీర్ అలీ బుధవారం నగరంలోని బైపాస్ రోడ్‌లోగల భూపతిరెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. మృతునికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నుడా చైర్మన్ కేశవేణు, తదితరులు ఉన్నారు.

వనదుర్గామాత కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే

సుభాష్‌నగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాత కలెక్టరేట్ వద్ద ఉన్న నవ దుర్గామాత ఆలయం వద్ద వనదుర్గామాత కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త హాజరయ్యారు. దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులకు ప్రసాదవితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీజీవో అధ్యక్షుడు అలుకకిషన్,కార్యదర్శి అమృత్‌కుమార్, ఆకుల ప్రసాద్, సత్యం,తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు పెంపు

సుభాష్‌నగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి):ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా నిర్వహిస్తున్నటువంటి ఓపెన్ ఇంటర్, పదవ తరగతి అడ్మిషన్ల గడువు ఈనెల 6వ తేదీ వరకు పొడగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఓపెన్ ఇంటర్, ఎస్సెస్సీలో ఈనెల 6వ తేదీ వరకు అడ్మిషన్లు పొందే అవకాశం ఉందని ఇదే చివరి అవకాశం అని ఎవరైనా అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ తూలా రవీందర్ 9908896096 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

4న రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ

సుభాష్‌నగర్,అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి):స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహణపై రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఈనెల 4వతేదీన శిక్షణ నిర్వహించనున్నారు.ఉదయం 10గంటలకు మొదటి దశఎన్నికలు జరిగే రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు మధ్యాహ్నం 2.30గంటల నుంచి రెండో దశ ఎన్నికలు జరిగే రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో శిక్షణ నిర్వహించనున్నారు.

పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

ధర్పల్లి,అక్టోబరు1(ఆంధ్రజ్యోతి):అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లాసహాయ కార్యదర్శి దాసు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్పల్లి మండల కేంద్రంలో న్యూడెమోక్రసీ భీంగల్ సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నదాత రైతన్న, వరుణుడి కోపాగ్నికి సర్వం కోల్పోయి ఆవేదన చెందుతున్నారని అన్నారు. నీటిలో మునిగి పనికి రాకుండా పోయిందని ఆయనఆవేదన వ్యక్తం చేశారు. వరి పంటకు కొనుగోలు కేంద్రాలను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు కూలిపోయిన ఇండ్లకు ఇందిరమ్మ పథకం కింద ఆంక్షలు లేకుం డా మంజూరు చేయాలన్నారు.ఈ సమావేశంలో కార్యదర్శి బాలయ్య, నాయకులు, ప్రజాసంఘాల నాయకులు,అబ్దుల్,ప్రిన్స్,వెంకటేష్,నారాయణ,వెంకటి,గంగాధర్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.